సాక్షి అన్నమయ్య జిల్లా

ఆదివారం । 31 । డిసెంబర్ । 2023



జగనన్న పాలనలో మహిళాభివృద్ధికి ప్రాధాన్యం

సీఎం వైఎస్ జగన్ పరిపాలనలో మహిళాభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. -8లో



దారి విషయంలో వివాదం

పెనగలూరు మండలం, ఎన్ఆర్ పురంలో తరతరాలుగా ఒకే కుటుంబానికి సంబంధించిన వ్యవసాయ భూమిలో దారికి సంబంధించి వివాదాలు ఏర్పడ్డాయి. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.240
రెండోరకం	రూ.100	రూ.178



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 203 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	400	522
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 869.560 కిలోలు

న్యూస్‌రీల్

1న ఐచ్ఛిక సెలవు

రాయచోటి టౌన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు జనవరి 1వ తేదీని ఐచ్ఛిక సెలవుగా ఉపయోగించుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ రాం పురుషోత్తం శనివారం పేర్కొన్నారు.ఉపాధ్యాయులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

శ్రీ వీరభద్రస్వామి ఆలయ హోదా పెంపు



రాయచోటి టౌన్: దక్షిణకాశీగా వెలుగొందుతున్న శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామి ఆలయానికి అసిస్టెంట్ కమిషనర్‌గా హోదా కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. స్వామి వారి నిత్య పూజలకు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు వేలాదిగా తరలివస్తారు. స్వామి హుండీ ఆదాయం ప్రతి ఏడాది పెరుగుతూ వస్తోంది. 2010 నాటికి లక్షల్లోనే ఉండేది. ప్రస్తుతం వార్షికాదాయం రూ.5కోట్లకు పైగా వస్తోంది. దీంతో ఆలయానికి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ స్థాయి నుంచి అసిస్టెంట్ కమిషనర్ స్థాయి హోదా కల్పించారు.

దరఖాస్తుల ఆహ్వానం

రాయచోటి అర్బన్: జిల్లాలోని ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో ఖాళీగా ఉన్న వివిధ పోస్టుల్లో నియామకాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా శిశుసంక్షేమ సాధికార అధికారిణి డి.శశికళ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు 20, సహాయకురాళ్లు 45, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలు 11 ఖాళీ ఉన్నాయన్నారు. జనవరి 4న రాయచోటి రెవెన్యూ డివిజన్ పరిధిలోని అభ్యర్థులకు ఆర్డీఓ కార్యాలయం ప్రాంగణంలో ఉదయం 10.30 గంటల నుంచి మౌఖిక పరీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. జనవరి 4న రాజంపేట డివిజన్ పరిధిలోని అభ్యర్థులకు సబ్‌కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో ఇంటర్వ్యూలు జరగుతాయన్నారు. మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని అభ్యర్థులకు జనవరి 5న మదనపల్లె సబ్‌కలెక్టర్ వారి కార్యాలయం ప్రాంగణంలో ఉదయం 10.30 గంటలకు మౌఖిక పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో మౌఖిక పరీక్షలకు హాజరు కావాలని, లేకపోతే అనుమతించబోమని తెలిపారు.

2న ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన

కడప సిటీ: బ్రహ్మంసాగర్ ఎడమకాలువ నుంచి కాశినాయన, కలసపాడు మండలంలోని పలు గ్రామాలకు నీటిని అందించే రెండు ఎత్తిపోతల పథకాలకు మంగళవారం శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, నియోజకవర్గ బూత్ కమిటీల సమన్వయకర్త కల్లూరు రమణారెడ్డిలు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎడమకాలువలోని 42వ కిలోమీటరు వద్ద కలసపాడు మండలం తెల్లపాడు సమీపంలో ఉదయం 9 గంటలకు.. కాశినాయన మండలంలోని 32వ కిలోమీటరు గంగనపల్లె సమీపంలో 11 గంటలకు ఎత్తిపోతల పథకాలకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ, నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నీటిపారుదలశాఖ అధికారులు కార్యక్రమానికి హాజరవుతారన్నారు. తెల్లపాడు వద్ద రూ. 16 కోట్లతో చేపడుతున్న ఈ పథకంతో తెల్లపాడు, రామాపురం, కొండపేట గ్రామాలకు, గంగనపల్లె వద్ద రూ. 32 కోట్లతో చేపడుతున్న ఎత్తిపోతల పథకంతో గంగనపల్లె, గొంటువారిపల్లె, బాలాయపల్లె, వరికుంట్లకు తాగు, సాగునీటి సౌకర్యం ఏర్పడుతుందన్నారు. రెండేళ్ల కిందట ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించి ఎత్తిపోతల పథకాలను మంజూరు చేయడంపై ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

నూతనోత్సాహం

2024 నూతన సంవత్సరంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల జాతర చేయనుంది. జనవరి 1 నుంచి ఫిబ్రవరి 14 వరకు మూడు ప్రధాన పథకాల ద్వారా అర్హులకు లబ్ధిని చేకూర్చడంతో పాటు సామాజిక న్యాయస్ఫూర్తికి ప్రతిబింబమైన 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమాలను అమలు పండుగ వాతావరణంలో నిర్వహించేందుకు తగిన చర్యలు చేపట్టింది.సంక్షేమ పథకాల షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో లబ్ధిదారుల్లో నూతనోత్సాహం నెలకొంది.

- కొత్త సంవత్సరంలో సంక్షేమ జాతర
- జనవరి, ఫిబ్రవరిలో వైఎస్సార్ పెన్షన్ కానుక, ఆసరా, చేయూత కార్యక్రమాలు
- పండుగ వాతావరణంలో నిర్వహించాలి: కలెక్టర్



కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి: సంక్షమ పథకాలను పండగ వాతావరణంలో నిర్వహించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో మాట్లాడారు. 2024 జనవరి 1వ తేదీ నుంచి వైఎస్సార్ పెన్షన్ కానుక కింద పెంచిన పెన్షన్ల పంపిణీ, జనవరి 17 నుంచి వైఎస్ఆర్ ఆసరా, రుణమాఫీ నాలుగో విడత పంపిణీ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఫిబ్రవరి 5న వైఎస్సార్ చేయూత పంపిణీ, అలాగే జనవరి 19న విజయవాడలో ముఖ్యమంత్రిచే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ తదితర కార్యక్రమాలను నిర్వహించడానికి ముందస్తు ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి దిశా నిర్దేశం చేశారు.



జనవరి 1 నుంచి వైఎస్సార్ పింఛన్ కానుక

రాష్ట్ర ప్రభుత్వం 2024 జనవరి 1 నుంచి వైఎస్సార్ పింఛన్ కానుకను రూ.2,750 నుంచి రూ.3 వేలకు పెంచి అవ్వాతాతలకు అందించనుందని కలక్టర్ తెలిపారు. జనవరి 3న ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారన్నారు. ఇందులో భాగంగా జనవరి 1 నుంచి 8వ తేదీ వరకు మండల స్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఏ రోజు ఏ మండలంలో కార్యక్రమం నిర్వహిస్తారో అక్కడ కొత్తగా పెంచిన పింఛన్ పంపిణీ చేయాలన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకున్న పింఛన్‌దారుల వివరాలను మొబైల్ అప్లికేషన్‌లో వంద శాతం పరిశీలనను పూర్తి చేయాలన్నారు. స్థానిక శాసనసభ్యులను, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకొని జనవరి 2 నుంచి 8వ తేదీలోపు మండలాల్లో పింఛన్ పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం నిర్వహించాలన్నారు.

23న వైఎస్సార్ ఆసరా

జనవరి 23న వైఎస్సార్ ఆసరా నాలుగో విడత మొత్తం పంపిణీ కార్యక్రమాన్ని సీఎం వైఎస్ జగన్ ప్రారంభిస్తారన్నారు. ఇందుకోసం జనవరి 17 నుంచి 22 వరకు అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. డీఆర్‌డీఏ సిబ్బంది, మహిళా సంఘాలు, సచివాలయం వారీగా సిబ్బందికి అవగాహన కల్పించి సూచనలు జారీ చేయాలన్నారు. 23న ఆసరా కార్యక్రమం ప్రారంభం అనంతరం 24 నుంచి 31 వరకు స్థానిక శాసనసభ్యుల ద్వారా మండల స్థాయిలో కార్యక్రమాలను పటిష్టంగా నిర్వహించాలన్నారు.

ఫిబ్రవరి 5న చేయూత

ఫిబ్రవరి 5న వైఎస్సార్ చేయూత పథకాన్ని మంత్రి ప్రారంభిస్తారని కలెక్టర్ చెప్పారు. జనవరి 27 నుంచి ఫిబ్రవరి 4వ తేదీ వరకు ముందస్తు అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. వైఎస్ఆర్ చేయూత పథకం కింద ఫిబ్రవరి 6 నుంచి 14వ తేదీ వరకు స్థానిక శాసనసభ్యుల సమన్వయంతో మండల స్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలని, మహిళా సంఘాలతో స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు.

▶▶ జనవరి 19న అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

సామాజిక న్యాయ ప్రతిరూపం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని జనవరి 19న విజయవాడలో సీఎం జగన్ ప్రారంభిస్తారని కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా మండలాల్లో సిగ్నేచర్ క్యాంపెయిన్ నిర్వహించాలన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా స్థాయిలో ఫొటో ఎగ్జిబిషన్, సాంస్కృతిక కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించాలని సూచించారు.రాబోయే రెండు నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాలను గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి వరకు విజయవంతం చేసే అంశాలపై అధికారులు మనసు పెట్టి పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఇందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు సత్యనారాయణ, మద్దిలేటి, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల స్పెషల్‌అధికారులు, ఎంపీడీఓలు, మునిసిపల్ కమిషనర్లు, డీఆర్‌డీఏ ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

9న సమావేశం

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా పరిషత్ స్థాయి సంఘాల సమావేశం జనవరి 9వ తేది ఉదయం 10 గంటలకు జెడ్పీ కార్యాలయంలో నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ముఖ్య కార్యనిర్వహణాధికారి సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

కౌశల్ పోటీల్లో ప్రతిభ



విద్యార్థులకు మెమెంటోలను అందజేస్తున్న ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: భారతీయ విజ్ఞాన మండలి, ఆంధ్రప్రదేశ్ కౌన్సిల్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సంయుక్తంగా శనివారం విజయవాడలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి కౌశల్ క్విజ్ పోటీలలో దొమ్మర నంద్యాల ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభను కనబరించారు. రాష్ట్రస్థాయిలో ద్వితీయ బహుమతిని కైవశం చేసుకున్నారు. వీరికి రూ. 12 వేలు నగదు, మెమెంటో, సర్టిఫికెట్‌లను ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ బండ్లపల్లె ప్రతాప్‌రెడ్డి, శాస్త్రవేత్త శ్రీనివాసరెడ్డి, విజ్ఞాన భారతి గవర్నింగ్ బాడీ సభ్యులు కొంపెల్ల శాస్త్రి, ఆంధ్రప్రదేశ్ వీఐపీ సామినేని ఉదయభాను చేతుల మీదుగా అందచేశారు. కౌశల్ జిల్లా కోఆర్డినేటర్ విజయ మోహన్‌రెడ్డిని డీఈఓ ఎద్దుల రాఘవరెడ్డి అభినందించారు.

కేవీఆర్ సైంటిఫిక్ సర్వీసెస్‌తో వైవీయూ ఒప్పందం

వైవీయూ: యోగివేమన విశ్వవిద్యాలయం, నెల్లూరు కేవీఆర్ సైంటిఫిక్ సర్వీసెస్ సాంకేతిక అంశాలపై మెమోరాండం ఆఫ్ అండర్ స్టాండింగ్ (ఎంఓయూ) కుదుర్చుకున్నాయి. వీసీ ఆచార్య చింతా సుధాకర్ సమక్షంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ఐటీ డైరెక్టర్ ఆచార్య ఎం.వి. శంకర్‌లు కేవీఆర్ సంస్థ ప్రతినిధులు కె. వెంకటేశ్వర్లు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఒప్పందం ద్వారా సంస్థ నుంచి సాంకేతిక సహకారం లభిస్తుందన్నారు. తద్వారా వైవీయూ ఉన్నతవిద్యకు ఐటీ విషయాల్లో నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి, పాలకమండలి సభ్యురాలు ఆచార్య పి.చంద్రమతీశంకర్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా. టి. చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అందరి చూపు.. ఆ ఘడియ వైపు





కడపలోని వైవీస్ట్రీట్‌లో జనసందడి

- మరికొన్ని గంటల్లో కాలగర్భంలో కలిసిపోనున్న మరో ఏడాది
- నయా జోష్‌కు మొదలైన కౌంట్‌డౌన్
- యువతలో ఉరకలెత్తుతున్న ఉత్సాహం

రాజంపేట టౌన్/కడప కల్చరల్: కులం, మతం, ప్రాంతం అన్న తేడా లేకుండా ప్రపంచమంతా ఉరకలేసే ఉత్సాహంతో జరుపుకునే ఏకైక వేడుక న్యూఇయర్. మరికొన్ని గంటల్లోనే ప్రపంచమంతా కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టబోతుంది. అదే సమయంలో ఎన్నో మధుర జ్ఞాపకాలు, కొన్ని చేదు, విషాద సంఘటనలు కలగలిపిన 2023వ సంవత్సరం మరికొన్ని గంటల్లోనే కాలగర్భంలో కలిసిపోనుంది. కొత్త ఏడాది ఆగమనం అనగానే అందరిలోనూ ఆనందం తొణికిసలాడుతుంది. ఆ మధుర క్షణాన్ని ఆనందంగా ఆస్వాదించేందుకు ప్రజలు సర్వం సిద్ధం చేసుకుంటున్నారు. కొత్త సంవత్సరం ఆరంభం కాగానే యువత చేసే సందడి అంతా ఇంతా కాదు. ఈ ఏడాది కూడా కొత్త సంవత్సరానికి గ్రాండ్‌గా వెల్‌కమ్ చెప్పేందుకు యువకులు తమ అభిరుచికి తగ్గట్లు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ జిల్లాలో మార్కెట్లు జనం సందడితో కళకళలాడుతున్నాయి. వస్త్ర దుకాణాలు, రెడీమేడ్‌షాపులు కిటకిటలాడాయి. జిల్లా వ్యాప్తంగా కేవలం నూతన సంవత్సర వేడుకలకు సంబంధించి దాదాపు రూ. 25 కోట్ల వ్యాపారం జరగనున్నట్లు సమాచారం.

- కడప నగరంలోని ప్రధానమైన మార్కెట్ వైవీ స్ట్రీట్‌లో జన సందడి పెరిగింది. ప్రధానంగా దుస్తుల కొనుగోలుకే ప్రజలు ప్రాధాన్యతనిస్తున్నారు. దీంతో దాదాపు చిన్నా, పెద్ద దుకాణాల్లో సందడి కనిపిస్తోంది. డైరీలు, గిఫ్ట్ దుకాణాలలో కూడా వ్యాపారాలు బాగా జరుగుతున్నాయి.

ఉత్సాహం మాటున పొంచివున్న ప్రమాదం

న్యూఇయర్ సందర్భంగా కొన్ని ప్రాంతాల్లో యువకులు బైక్‌లను అతివేగంగా నడుపుతుంటారు. గతంలో బైక్‌లు అతివేగంగా ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు కూడా ఉన్నాయి. 2017వ సంవత్సరం డిసెంబర్ 31వ తేదీ రాత్రి 12 గంటల సమయంలో రాజంపేట ఫ్లెఓవర్ బ్రిడ్జిపై అతివేగంగా బైక్‌లు నడపడంతో ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే మృతి చెందడం ఓ ఉదాహరణగా చెప్పవచ్చు. ఈ సంఘటన జరిగి ఇప్పటికి ఏడేళ్లయినా న్యూఇయర్ సందర్భంలో చర్చకు వస్తూనే ఉంది.

▶▶ నిబంధనలు పాటించకపోతే చర్యలు



రాయచోటి: నూతన సంవత్సర వేడుకల్లో భాగంగా 31వ తేదీ రాత్రి నిబంధనలను పాటించని వారిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ బి కృష్ణారావు శనివారం పేర్కొన్నారు. ఆదివారం సాయంత్రం నుంచి జిల్లాలోని ప్రధాన రహదారుల్లో అతిగా మద్యం తాగి వాహనం నడపడం, చేయకూడదన్నారు. ప్రజలకు ఇబ్బంది కరంగా బహిరంగ ప్రదేశాలలో కేక్‌లు కట్ చేయడం వంటి పనులు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు కూడా నమోదు చేస్తామని హెచ్చరించారు.

28 నుంచి జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు



మాట్లాడుతున్న డీఈఓ పురుషోత్తం

రాజంపేట టౌన్: వచ్చే ఏడాది జనవరి 28వ తేదీ నుంచి ఐదు రోజుల పాటు రాజంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానంలో 67వ జాతీయ స్థాయి అండర్-14 బాలికల కబడ్డీ పోటీలు జరుగుతాయని డీఈఓ పురుషోత్తం తెలిపారు. స్థానిక ప్రభుత్వ హైస్కూల్‌లో శనివారం పోటీల నిర్వహణపై రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గాల్లోని వివిధ మండలాలకు చెందిన ఎంఈఓలు, హెచ్‌ఎంలు, పీడీ, పీఈటీలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో డీఈఓ మాట్లాడారు. పోటీల నిర్వహణకు దాదాపు 20 కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి కమిటీ తమకు అప్పచెప్పిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. ప్రాంతీయ వ్యాయామ విద్య తనిఖీ అధికారి (ఆర్‌ఐపీ) జీ.భానుమూర్తిరాజు మాట్లాడుతూ దేశం నలుమూలల నుంచి వివిధ రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు పాల్గొంటారని, వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కమిటీ ప్రతినిధులు చూడాలన్నారు.కార్యక్రమంలో రాజంపేట, నందలూరు, పుల్లంపేట మండలాల ఎంఈఓలు కొండూరు రఘునాథరాజు, నాగయ్య, జీ.చక్రధర్‌రాజు పాల్గొన్నారు.

● డాక్టరేట్ అందజేత



డాక్టరేట్‌ను అందుకుంటున్న పసుపులేటి శంకర్



తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి

ఆధ్యాత్మిక ప్రవచనకర్త, ఒంటిమిట్ట పోతన సాహిత్య పీఠం అధ్యక్షుడు పసుపులేటి శంకర్‌కు ఆసియా ఇంటర్నేషనల్ కల్చరల్ రీసెర్చ్ యూనివర్సిటీ శనివారం తమిళనాడు రాష్ట్రంలోని హోసూరులో డాక్టరేట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ ఆధ్యాత్మికం, దైవిక రంగంలో తాను గతంలో చేసిన సేవలను గుర్తిస్తూ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ఇవ్వడం చాలా సంతోషంగా ఉందని అన్నారు.అలాగే గాలివీడు మండలవాసి ప్రముఖ విద్యావేత్త, ఆర్కే అబాకస్ చైర్మన్ తాతిరెడ్డి రామకృష్ణారెడ్డి డాక్టరేట్‌ను అందుకున్నారు. విద్యారంగంలో ఆయన చేసిన విశిష్ట సేవలను గుర్తించి డాక్టరేట్‌ను ప్రదానం చేశారు.

-నందలూరు(రాజంపేట)/గాలివీడు

వివాహిత ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ సమస్యలతో ఓ వివాహిత ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం నిమ్మనపల్లె మండలంలో జరిగింది. నిమ్మనపల్లె పంచాయతీ పెద్దమాదిగపల్లెకు చెందిన సురేష్ భార్య వై.గోపి(24) కుటుంబ సమస్యలతో మనస్తాపం చెంది ఈగలమందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే స్థానిక పీహెచ్‌సీకి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. బాధితురాలు కోలుకుంటోంది. నిమ్మనపల్లె పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

ములకలచెరువు : కర్ణాటక మద్యం తరలిస్తున్న ఇద్దరు వైఎస్సార్ జిల్లా వాసులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఈబీ సీఐ మల్లిక తెలిపారు. వైఎస్సార్ జిల్లా చక్రాయపేట మండలం భగినెనాయక్ తాండాకు చెందిన ఈ.శ్రీను నాయక్(34), ఈ.తిరుపాల్ నాయక్(51) పల్సర్ బైక్ లో కర్ణాటకకు చెందిన 80 టెట్రాప్యాకెట్లు బైకులో తెస్తుండగా పీటీఎం జింకలమిట్ట వద్ద శనివారం వేకువజామున అరెస్టు చేశామని తెలిపారు.

జిల్లా ఆస్పత్రిలో గర్భిణి మృతి

• మృతురాలు పశ్చిమబెంగాల్ వాసి
• పుంగనూరు చింతపండు ఫ్యాక్టరీలో కూలిపనులకు రాక


మృతిచెందిన గర్భిణి మోనిషా బీబీ

మదనపల్లె : అర్ధరాత్రిలో సరైన వైద్యం లభించక, సిబ్బంది నిర్లక్ష్యంతో పశ్చిమబెంగాల్‌కు చెందిన గర్భిణి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో మృతిచెందిన సంఘటన శనివారం తెల్లవారుజామున జరిగింది. పశ్చిమబెంగాల్ సౌత్ 24 పరగణాస్, బుడ్జ్‌బుడ్జ్ మండల్, కాళీపూర్‌కు చెందిన మోనిషా బీబీ(28) తమ ప్రాంతానికి చెందిన మహమ్మద్ షానవాజ్‌ఖాన్‌ను కొంతకాలం క్రితం ప్రేమవివాహం చేసుకుంది. వీరి పెళ్లికి ఇరుకుటుంబాలలో ఒప్పుకోకపోవడంతో దంపతులు ఇద్దరూ కలిసి ఉపాధి కోసం చిత్తూరు జిల్లా పుంగనూరుకు చేరుకున్నారు. స్థానికంగా ఓ చింతపండు వ్యాపారి దగ్గర పనిచేస్తూ జీవిస్తున్నారు. ఈ క్రమంలో ఆమె మొదటిసారి గర్భం దాల్చగా శుక్రవారం రాత్రి పురిటినొప్పులు అధికమవడంతో స్థానికులైన పీఎస్.సిద్ధిక్, బీజీ నూరుల్లా మానవత్వంతో, వారికి సాయపడే ఉద్దేశంతో ఆమెను పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు అర్ధరాత్రి వరకు చికిత్స చేసి, ఇక్కడ సాధ్యం కాదని, వెంటనే మదనపల్లె జిల్లా ఆస్పత్రికి వెళ్లాల్సిందిగా సూచించారు. అర్ధరాత్రి 1.30 గంటలకు వారు బాధితురాలిని అంబులెన్స్‌లో తీసుకువచ్చారు. ఇక్కడి వైద్యసిబ్బంది ఆమెను గైనిక్ వార్డుకు తరలించారు. అయితే సరైన రీతిలో చికిత్స అందించకపోవడంతో ఆమె పరిస్థితి విషమంగా మారింది. తెల్లవారుజామున 3.30 గంటల సమయంలో మోనిషా బీబీ గర్భంలోని బిడ్డతో పాటు ఆమె మృతి చెందింది. ఆమె మృతి చెందిన విషయం అవుట్‌పోస్ట్ సిబ్బంది టూటౌన్ పోలీసులకు తెలపడంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. మోనిషా బీబీ మృతిచెందిన సమాచారం ఆమె బంధువులకు తెలిపితే, తమకు సంబంధం లేదంటూ వారు సమాధానం ఇచ్చారు. దీంతో శనివారం మధ్యాహ్నం ఆమె మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పుంగనూరుకు తరలించారు.

హంద్రీనీవా కాలువలో పడి విద్యార్థి మృతి


అక్షయ్ మృతదేహం

మదనపల్లె : హంద్రీనీవా కాలువలో పడి ప్రమాదవశాత్తు ఓ విద్యార్థి మృతిచెందిన సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. బసినికొండ పంచాయతీ డీఎస్పీ బంగ్లా వెనుక రామాలయం వీధిలో నివాసం ఉన్న ఆటోడ్రైవర్ చంద్రకుమారుడు సి.అక్షయ్(18), పట్టణంలోని వెంకటరెడ్డి సిద్ధార్థ కళాశాలలో ఇంటర్మీడియట్ సెకండ్ ఇయర్ చదువుతున్నాడు. ప్రీ ఫైనల్ పరీక్ష అనంతరం పుంగనూరుకు చెందిన అతని స్నేహితుడు హర్షిత్‌కు ఆన్‌లైన్‌లో ఆర్డర్ చేసిన షూస్ ఇవ్వాల్సి ఉండటంతో ఇద్దరు కలిసి ఇంటికి వచ్చారు. ఇంటికి తాళాలు వేసి ఉండటంతో, మరో స్నేహితుడు లోహిత్ ఇంటికి వెళ్లారు. ముగ్గురు కలిసి వడ్డిపల్లె సమీపంలోని హంద్రీనీవా కాలువ వద్దకు చేరుకున్నారు. కాలువగట్టున కూర్చుని సరదాగా ఫొటోలు తీసుకుంటుండగా, ఈ క్రమంలో కాలుజారి ప్రమాదవశాత్తు అక్షయ్ కాలువలో పడిపోయాడు. మరో స్నేహితుడు లోహిత్ అతడిని కాపాడేందుకు ప్రయత్నించాడు. అంతలోనే అక్షయ్ మృతి చెందాడు. స్థానికులకు సమాచారం ఇవ్వగా వారు వచ్చి అక్షయ్‌ని బయటకు తీశారు. అనంతరం మృతదేహాన్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. కుమారుడు మృతి చెందాడన్న విషయం తెలుసుకున్న అక్షయ్ తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకుని బోరున విలపించారు. పెద్దసంఖ్యలో బసినికొండ వాసులు, అతడి స్నేహితులు ఆస్పత్రికి చేరుకున్నారు. తాలూకా పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

జగనన్న పాలనలో మహిళాభివృద్ధికి ప్రాధాన్యం


కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ప్రభుత్వవిప్ కొరముట్ల

రైల్వేకోడూరు అర్బన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పరిపాలనలో రాష్ట్రంలోని మహిళలు తమ కాళ్లపై తాము నిలబడే విధంగా అన్ని పథకాల లబ్ధి వారికి చేకూరే విధంగా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఏపీఎండీసీ ఫౌండేషన్ సహకారంతో స్కిల్ హబ్‌లో శిక్షణ పొందిన 120 మంది మహిళలకు స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ కొండూరు అజయ్ రెడ్డి, ఏపీఎండీసీ ఎండీ వెంకటరెడ్డిలతో కలిసి 120 కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన నాటి నుంచి మహిళా ప్రాధాన్యత కల్గిన పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తున్నారని చెప్పారు. మహిళా సాధికారతే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గత ప్రభుత్వాలు కేవలం మహిళలను ఓటుబ్యాంక్‌గా చూశాయన్నారు. నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మహిళలను ఇంటి యజమానిని చేశారన్నారు. రాబోయే ఎన్నికలలో మహిళలు జగనన్నకు అండగా ఉంటారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహాకమిటీ చైర్మన్ పంజం సుకుమార్ రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమనవర్మ, జెడ్పీటీసీ రత్నమ్మ, ఉపసర్పంచ్ తోట శివసాయి, సీహెచ్ రమేష్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

దారి విషయంలో దాయాదుల వివాదం


దశాబ్దాలుగా ప్రధాన రహదారి నుంచి పంటపొలాల్లోకి ఉన్న దారి


పంట పొలాలకు వెళ్లే దారిలో అడ్డంగా వేసిన కట్టెలు

గొడవలకు ఆజ్యం పోస్తున్న టీడీపీ ఇన్‌చార్జి

పెనగలూరు (ఓబులవారిపల్లె) : పెనగలూరు మండలం, ఎస్ఆర్ పురంలో తరతరాలుగా ఒకే కుటుంబానికి సంబంధించిన వ్యవసాయ భూమిలో దారికి సంబంధించి వివాదాలు ఏర్పడ్డాయి. తాతలనాటి వ్యవసాయ భూమిని అన్నదమ్ములు విడిపోయి భూములు పంచుకొని సాగు చేసుకుంటున్నారు. దశాబ్దాలుగా ప్రధాన రహదారి నుంచి పొలాలకు దారి ఉంది. అయితే టీడీపీకి చెందిన కె.గురవయ్య కుమారుడు కె.రామచంద్రయ్య తన భూమిలో దారిని కూడా కలిపి మూడు నెలల క్రితం ముళ్లకంచె ఏర్పాటు చేశాడు. దీంతో ఆ దారి గుండా పొలాలు ఉన్న బెనర్జీ, నారాయణ, సాయి తదితర రైతులు దారిలేక ఇబ్బందులు పడ్డారు. దీంతో ఇబ్బందులు పడ్డ దాయాది రైతులు రెండు రోజుల క్రితం కంచెను తొలగించి పాత దారిని ఏర్పాటు చేసుకున్నారు. రైల్వేకోడూరు తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి కస్తూరి విశ్వనాథ నాయుడు కె. రామచంద్రయ్యకు మద్దతుగా పంట పొలం వద్దకు వచ్చి దాయాదుల పంట పొలం దారి గొడవకు ఆజ్యం పోశాడు. వైఎస్సార్ సీపీ నేతలు దౌర్జన్యకాండ అంటూ అసత్య ఆరోపణలు చేశారు. దాయాదులకు సంబంధించిన గొడవలో కస్తూరి విశ్వనాథ నాయుడు తలదూర్చి రాజకీయం చేయడాన్ని గ్రామ రైతులు విమర్శిస్తున్నారు. ఈ గొడవ విషయంపై పచ్చ మీడియాలో ఇష్టం వచ్చిన రాతలు రాయించారు. దీంతో రామచంద్రయ్య మళ్లీ శనివారం దారికి అడ్డుగా కట్టెలను వేసి ఇనుప తంతిని లాగాడు. తాతలనాటి పంట పొలాలకు వెళ్లే దారిని రామచంద్రయ్య అడ్డుగా కంచెవేశాడని తమ పంట పొలాలకు వెళ్లేందుకు దారి యథావిధిగా ఏర్పాటు చేయాలని రైతులు కోరుకుంటున్నారు. ఈ విషయంపై తహసీల్దార్ శ్రీధర్ రావును వివరణ కోరగా తమ దృష్టికి ఎలాంటి దారి సమస్య రాలేదని తెలిపారు.

వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి తీవ్రగాయాలు


లారీ ఢీకొని తీవ్రంగా గాయపడిన రమేష్


బైక్ అదుపుతప్పి గాయపడిన జి.గంగిరెడ్డి

మదనపల్లె : వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు సిటీ కే.ఆర్.పురం అయ్యప్పనగర్‌కు చెందిన రామయ్య కుమారుడు రమేష్(51), ములకలచెరువు మండలంలోని బురకాయలకోటకు ద్విచక్రవాహనంలో శనివారం బయలుదేరాడు. మార్గమధ్యంలో కురబలకోట మండలం విశ్వం కాలేజీ వద్ద ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు అతన్ని మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో బెంగళూరుకు రెఫర్ చేశారు. ముదివేడు పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు. అలాగే పీటీఎం మండలం తుమ్మలగుంట పంచాయతీ గజ్జలవారిపల్లెకు చెందిన వెంకటరమణారెడ్డి కుమారుడు జి.గంగిరెడ్డి(40) శనివారం తన పొలంలో వరినాట్లు వేస్తుండగా, నారు తక్కువ కావడంతో తెచ్చేందుకు ద్విచక్ర వాహనంలో బూర్లపల్లెకు బయలుదేరాడు. మార్గమధ్యంలోని గంగంపల్లె క్రాస్ వద్ద బైక్ అదుపుతప్పి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు బాధితున్ని అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు.



వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

అమ్మ ఒడి ఎంతో ఊరట నిస్తోంది



జగనన్న ప్రవేశ పెట్టిన అమ్మ ఒడి పథకం మాకు ఎంతో ఊరట నిస్తోంది. మా భర్త వెల్డింగ్ పని చేయగా వచ్చే ఆదాయంతో జీవనం సాగిస్తున్నాం. జగనన్న వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల్లో మంచి వసతులు కల్పించడంతో పాటు అమ్మ ఒడి అందిస్తున్నారు. నాకు బాబు, పాప ఇద్దరు పిల్లలు. బాబు అలీ 8వ తరగతి. పాప రుఫైదా 5వ తరగతి. ఇద్దరూ ప్రభుత్వ పాఠశాలల్లోనే చదువుతున్నారు. ప్రైవేట్ బడుల్లో చదివించాలంటే చాలా ఖర్చుతో కూడుకున్న విషయం. అయితే జగనన్న వచ్చిన తర్వాత ప్రభుత్వ పాఠశాలల రూపు రేఖలే మారిపోయాయి. ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా చదివిస్తున్నారు. గతం కంటే ప్రస్తుతం మా పిల్లలు బాగా చదువుతున్నారు. ముఖ్యంగా జగనన్న ఇస్తున్న అమ్మ ఒడి పథకం ద్వారా మా కుటుంబానికి చాలా చేదోడు, వాదోడుగా ఉంది. జగనన్నకు జన్మంతా రుణపడి ఉంటాం.

–షేక్ హాజిమా, అక్కానగర్, కమలాపురం

సొంతింటి కల నెరవేరింది



నాది మండల కేంద్రమైన సింహాద్రిపురం. మేము ఎన్నో ఏళ్ల తరబడి అద్దె ఇంట్లో బతికాం. జీవనం జరగడానికి కష్టంగా ఉన్న పరిస్థితులలో సొంతిల్లు ఉంటే అద్దె డబ్బులైనా మిగులుతాయనుకున్నాం.గత ప్రభుత్వంలో మా గోడు ఎవరూ పట్టించుకోలేదు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ఎలాంటి సిఫార్సు లేకుండా దరఖాస్తు చేసుకున్న వెంటనే వలంటీర్ ఇంటి వద్దకు వచ్చి ఇంటి తాలూకు పట్టా ఇవ్వడంతో సొంతింటి కల నెరింది. సీఎం వైఎస్ జగన్‌కు మేము ఎప్పుడూ రుణపడి ఉంటాం.

– ముళ్ల ముంతాజ్, సింహాద్రిపురం

విషపూరిత ద్రవం సేవించిన చిన్నారులు

పరిస్థితి విషమం


ప్రియదర్శిని


జ్ఞానిక

బి.కొత్తకోట/గుర్రంకొండ : విషపూరిత ద్రవ పదార్థాన్ని తాగిన ఇద్దరు చిన్నారులు అపస్మారకస్థితికి వెళ్లిన ఘటన శనివారం గుర్రంకొండ మండలం చెర్లోపల్లెలో జరిగింది. బి.కొత్తకోట మండలం బడికాయలపల్లె పంచాయతీ చెరువుముందరపల్లెకు చెందిన గంగరాజు చెర్లోపల్లెలో వివాహం చేసుకున్నాడు. దీనితో కుమార్తె ప్రియదర్శిని (5)ని అత్త ఇంటికి పంపాడు. శనివారం సాయంత్రం ప్రియదర్శిని, ఇదే గ్రామానికి చెందిన జ్ఞానిక (3)లు రోడ్డుపై ఆడుకొంటూ తిరిగారు. అక్కడే పడిఉన్న ఓ బాటిల్‌లోని ద్రవాన్ని తాగారు. కొంతసేపటికి తూలుతూ వచ్చి ఇంటివద్ద పడిపోయారు. ఈ విషయాన్ని గుర్తించిన కుటుంబసభ్యులు వైద్యం కోసం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని చెప్పడంతో రాత్రి 108లో తిరుపతికి తరలించారు. చిన్నారుల పరిస్థితి విషమంగా ఉండటం, వీరు సేవించిన విషపూరిత పదార్థం ఏమిటో తెలియకపోవడంతో తల్లిదండ్రులు ఆవేదనతో తల్లడిల్లిపోతున్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : మనస్తాపంతో యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన శనివారం తంబళ్లపల్లె మండలంలో జరిగింది. కుక్కరాజుపల్లె హరిజనవాడకు చెందిన రామకృష్ణ కుమారుడు సోమశేఖర్ (20) ఓ యువతిని ప్రేమించాడు. నెలరోజుల క్రితం ఆ యువతి సోమశేఖర్ ఇంటికి రాగా, అతని తల్లిదండ్రులు గొడవలు జరుగుతాయన్న కారణంతో ఆమెను వారించి ఇంటికి పంపించివేశారు. శనివారం ఆ యువతి మరోసారి సోమశేఖర్‌కు ఫోన్‌చేసి మాట్లాడటంతో మానసిక వేదనతో మనస్తాపం చెంది విషద్రావణం తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే అంబులెన్స్ వాహనంలో మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తంబళ్లపల్లె పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

అందరి సహకారంతో బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపిస్తా

కడప అగ్రికల్చర్ : జిల్లాలోని ఖాతాదారులు, ప్రజాప్రతినిధులు, బ్యాంకు సిబ్బంది అందరి సహకారంతో డీసీసీ బ్యాంకును మరింత అభివృద్ధి పథంలో నడిపిస్తామని డీసీసీ బ్యాంక్, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి పేర్కొన్నారు. శనివారం కడప డీసీసీ బ్యాంకు సమావేశ మందిరలో డీసీసీ బ్యాంకు సీఈఓ కందుల రాజేంద్రకుమార్ ఆధ్వర్యంలో బ్యాంకు డైరెక్టర్లు, సిబ్బందితో కలిసి 2024 సంవత్సరానికి సంబంధించిన నూతన క్యాలెండర్, డైరీలను ఆమె ఆవిష్కరించారు. ముందుగా ఆమె ఖాతాదారులు, బ్యాంకు డైరెక్టర్లు, సిబ్బందికి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో 30 ఏళ్ల నుంచి నష్టాల బాటలో ఉన్న డీసీసీ బ్యాంకును లాభాల బాటలోని తెచ్చామన్నారు. ఇక సొసైటీలను కూడా లాభాల బాటలో నడిపించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే లింగాపురం, ఎల్లటూరులలో గోడౌన్లను నిర్మించి రైతులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. త్వరలో జిల్లాలో 4 నూతన బ్రాంచులను ఏర్పాటు చేస్తున్నామన్నారు.

క్రీడలు జీవితంలో భాగం కావాలి


బహుమతులను అందజేస్తున్న ఎస్పీ కృష్ణారావు

రాయచోటి : పోలీసు విధులతోపాటు క్రీడలు జీవితంలో ఒకభాగం కావాలని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు అన్నారు. అన్నమయ్య జిల్లా, రాయచోటి పోలీస్ ప్రధాన కార్యాలయం పెరేడ్ గ్రౌండ్‌లో రిఫ్రెషర్ ట్రైనింగ్ కోర్సులో భాగంగా పోలీసులకు వాలీబాల్ క్రీడలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ క్రీడల వలన స్నేహ సంబంధాలను, దేహదారుఢ్యాన్ని పెంచుకోవచ్చన్నారు. విధులలో ఏకాగ్రతతో పనిచేసేలా సహకరిస్తాయన్నారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంతోపాటు క్రీడలలో పాల్గొనాలని ఎస్పీ పోలీసులకు సూచించారు.

దాడిలో గాయపడిన మహిళ మృతి


కృష్ణవేణి(ఫైల్)

ఒంటిమిట్ట : మండల పరిధిలోని రాచగుడిపల్లి గ్రామంలో గల ఎస్సీ కాలనీలో ఈనెల 18న భర్త దాడి చేయడంతో గాయపడిన కృష్ణవేణి(38) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు.. ఈ నెల 18న రాచగుడిపల్లిలోని ఎస్సీకాలనీలో కృష్ణవేణిని ఆమె భర్త రామయ్య రోకలి కర్రతో తలపై కొట్టగా గాయపడింది. ఆమె తిరుపతిలో చికిత్స పొందుతూ శనివారం మరణించింది.